ప్రజాశక్తి
సోమవారం 7 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ సిఎంకు సన్మానం

సాలూరు: డిప్యూటీ సిఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఘనంగా ఆదివారం స్థానిక ఆర్యవైశ్య ధర్మశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంటా వెంకటరాజు, నాయకులు ఇందుపూరి నారాయణరావు పాల్గొన్నారు.



కోటగట్లను, రాజన్నదొరను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

సమగ్ర శిక్షలో ఇష్టారాజ్యం

నోటిఫికేషన్ లేకుండా పోస్టుల భర్తీ?

జిల్లాలో సమగ్ర శిక్ష కార్యాలయంలో వ్యవహారాలన్నీ అడ్డగోలుగా సాగిపోతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనలను బేఖాతర్ చేస్తూ, నోటిఫికేషన్లు లేకుండానే పోస్టులను భర్తీ చేసుకుంటూ ఎపిసి సొమ్ము చేసుకుంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు కెజిబివిల తనిఖీ పేరుతో సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అయితే జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతోనే ఈ పనులన్నింటినీ సాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత కొంతకాలంగా సమగ్ర శిక్షలో కార్యక్రమాలన్నీ ఇష్టారాజ్యంగా సాగుతున్నాయని తెలుస్తోంది. డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తున్న ప్రస్తుత ఎపిసి ఏడాది కాలానికి గాను సమగ్ర శిక్షలో పనిచేసేందుకు డెప్యుటేషన్‌పై వచ్చారు. ఈ ఏడాది డెప్యుటేషన్ కాలం కూడా పూర్తైంది. ఇదే శాఖలో కొనసాగేందుకు ముమ్మురంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఆయన డెప్యుటేషన్ కొనసాగింపు ఫైల్ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు ఆయనను కొనసాగింపుపై వ్యతిరేకత వ్యక్తం చేయడమే అందుకు కారణమని తెలిసింది. ఎపిసి వైఖరి పట్ల జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

ఇటీవల కాలంలో నోటిఫికేషన్ ఇవ్వకుండానే సమగ్ర శిక్షలో సుమారు 70 అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా కలెక్టర్ వద్దకు ఫైల్స్ పంపి కెజిబివిల్లో అకౌంటెంట్, కుక్, అటెండర్, స్వీపర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేసినట్టు సమాచారం. రాష్ట్ర విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఈ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఈ పోస్టులను భర్తీ చేసినట్టు తెలిసింది. సమగ్ర శిక్ష ఎపిసి పక్కనే డిఇఒ ఎక్స్ అఫిషియో కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. డిఇఒ వద్దకు ఫైల్ పంపించకుండానే మొత్తం ఫైళ్లన్నీ ఎపిసి నుంచి కలెక్టర్‌కు నేరుగా చేరుతున్నట్లు కార్యాలయ సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

కెజిబివి సిబ్బందిపై వేధింపులు

ఎపిసి నిత్యం కెజిబివిలను తనిఖీలు చేస్తూ ప్రిన్సిపాళ్లను, టీచర్లను వేధిస్తున్నారన్న ఆరోపణలు కొన్ని నెలలుగా వస్తున్నాయి. నిత్యం ఏదో ఒక పాఠశాలకు వెళ్లి, హాజరు పట్టికలను తనిఖీ చేస్తూ, చిన్నపాటి పొరపాట్లకు కూడా మెమోలు జారీతోపాటు భయభ్రాంతులకు గురిచేయడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు సకాలంలో హాజరైనప్పటికీ ఏదో ఒక కారణం చూపి సిబ్బంది, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు కూడా ఎపిసి వ్యవహారంపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్ని విమర్శలు ఉన్నా జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు విస్మయం చెందుతున్నారు.

ఎపిసి వ్యవహార శైలిపై రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు

ఎపిసి డెప్యుటేషన్ కాలం గత సెప్టెంబర్‌తో ముగిసింది. ఇప్పటికే జిల్లాలో ఆయన వ్యవహార శైలిపై రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల జిల్లాలో సమగ్ర శిక్షలో పని చేసిన గణాంక అధికారి రమణారెడ్డిని సరెండర్ చేయడంతో ఆయన రాష్ట్ర ప్రాజెక్టు అధికారికి ఎపిసిపై ఫిర్యాదు చేశారు. మెంటాడ కెజిబివి ప్రిన్సిపల్ ప్రమీలాదేవిని అక్రమంగా తొలగించడంతో ఆమె రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరిద్దరి ఫిర్యాదు మేరకు ఎపిసి స్వామినాయుడుపై విచారణకు ఆర్‌జెడిని నియమించారు. దీంతో ఎపిసిపై కొద్ది రోజుల క్రితం విచారణ జరిగింది.

జీవనశైలిలో మార్పు రావాలి

- హెల్త్, వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా అవగాహన
- వైద్యారోగ్య సేవలపై సమీక్షించిన సిఆర్‌ఎం బృందం
- వైద్య సేవలపై సంతృప్తి



వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమైన సిఆర్‌ఎం బృందం సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతిఒక్కరికీ శారీరక వ్యాయామం చాలా అవసరమని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సి ఉందని జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. దీనికోసం హెల్త్, వెల్‌నెస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిందని తెలిపింది. ప్రజల జీవనశైలిలో మార్పు రావాలని వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్‌కు చెందిన 15వ సిఆర్‌ఎం (కామన్ రివ్యూ మిషన్) బృందం ఆదివారం జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా వైద్యారోగ్య రంగానికి చెందిన వివిధ విభాగాల అధిపతులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బృందం సభ్యులు డాక్టర్ రంజన్ కుమార్ చౌదరి, డాక్టర్ అంకుర్ నాయర్, విశాల్ కటారియా, డాక్టర్ విజయ్ రజనా, డాక్టర్ శ్వేతాశర్మ, డాక్టర్ మోనికా షైనీ, డాక్టర్ కె.శ్రీనివాస్‌తోపాటు వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. డిఎంహెచ్‌ఒ ఎస్‌వి రమణకుమారి, ఆయా విభాగాల అధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో వైద్యారోగ్య కార్యక్రమాలు, ఈ రంగంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గణాంకాలతో సహా వివరించారు. జిల్లాలో అందిస్తున్న సేవలు, కార్యక్రమాలపై బృందం సభ్యులు ఆరా తీశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రంజన్ కుమార్ చౌదరి మాట్లాడుతూ జిల్లాలో వైద్యారోగ్య రంగం పనితీరును అభినందించారు. ముఖ్యంగా డయాలసిస్ లాంటి సేవలను మెరుగుపర్చి, ఇఎన్‌డిపి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆశా వర్కర్లు మొబైల్ ఫోన్ ద్వారా అందిస్తున్న సేవలను తెలుసుకొని ప్రశంసించారు. 108, 104, 102 తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవల గురించి క్షుణ్ణంగా ఆరా తీసి, సంతృప్తి వ్యక్తం చేశారు. శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం వల్ల ఆడపిల్లలు, కాన్పు సమయంలో పలు ఇబ్బందులు పడుతున్నారని ప్రముఖ గైనకాలజిస్ట్ గేదెల సన్యాసమ్మ బృందం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై బృందం సభ్యులు స్పందిస్తూ ప్రజల జీవనశైలిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక వ్యాయామాన్ని అలవర్చుకోవాలన్నారు. దీనికోసమే ప్రభుత్వం హెల్త్ అండ్ వెల్‌నెస్ కార్యక్రమం కింద యోగా, వ్యాయామానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. స్కూల్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రతీ ప్రభుత్వ, అనుబంధ పాఠశాలల్లో త్వరలో అమలు చేయనున్నామని చెప్పారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చి, వ్యాయామ పాఠాలను బోధిస్తామన్నారు. సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణ రావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఒ పద్మలీల, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బృందం సభ్యులు సర్వజన ఆస్పత్రిని, ఘోషాస్పత్రిని సందర్శించారు.

పట్టణాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక నగర పంచాయితీలో ఆదివారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పారిశుధ్యం పనులను తనిఖీ చేశారు. నగర పంచాయతీ కార్యాలయం, నాగవంశపు వీధి జంక్షన్ తదితర ప్రాంతాల్లో పరిశీలించి చెత్త లేకుండా చూడాలని సచివాలయ, నగర పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పూర్తిస్థాయిలో పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.



ప్రచారంలో భాగంగా మంగళాపురంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

10న రైతు మహా ప్రదర్శన

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, సాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఈనెల 10న రైతు మహా ప్రదర్శన జరుగుతుందని, ఈ మహాప్రదర్శనకు జిల్లాలోని రైతులంతా పెద్దఎత్తున పాల్గొనాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మనాయుడు, మండల అధ్యక్ష కార్యదర్శులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు. బోను గౌరునాయుడు, జాడుదొర గంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద ఆదివారం రైతు మహాప్రద్శన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మనాయుడు మాట్లాడుతూ ఇటీవల కురిసిన తుఫానుకు పంట నష్టం జరిగిందని, దీనిపై కలెక్టర్ స్పందించి పంట నష్ట పరిహారం గుర్తించి రైతులని ఆదుకోవాలని వినతులిచ్చినా ఇంతవరకు స్పందించిన పరిస్థితి లేదన్నారు.. కార్యక్రమంలో రైతు మండల నాయకులు నల్లి నరసింగరావు, మంచాల భీమయ్య, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేశారు.

పాలకొండ రూరల్: పార్వతీపురంలో ఈనెల10న రైతు మహా ప్రదర్శన జరుగుతుందని, దీన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఇందులో భాగంగా గొట్టమంగళాపురంలో జరిగిన ప్రచారంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక నిర్ణయాల అమలు చేస్తున్నాయని, విద్యుత్తు సవరణ చట్టం చేసి మోటార్లకు మీటర్లు బిగిస్తున్నారన్నారు. రైతు పంటకు గిట్టుబాటు ధర లేదని, రైతులు పంటలు పండించలేని పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం ప్రతినిధులు వారాడ గోవిందరావు, జి తవిటినాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు కేంద్రం సహాయ నిరాకరణ

శంకుస్థాపనకు ముందుకు రాని ప్రధాని ● అయినా బ్రహ్మరథం పడుతున్న వైసిపి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోంది. కోర్టు అడ్డంకులు తొలగిపోయినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్రమోడీ ముందుకు రావడం లేదు. దీంతో మన జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందంటూ యూటర్న్ తీసుకున్నారు. అయినప్పటికీ త్వరలో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధానికి బ్రహ్మరథం పట్టేందుకు వైసిపి తహతహలాడుతోంది. మన జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

ఎయిర్‌పోర్టు, గిరిజన విశ్వవిద్యాలయాలకు ప్రధాని చేతులమీదుగా శంకుస్థాపన చేస్తారంటూ ఇటీవల మంత్రి బొత్స ప్రకటించిన విషయం విదితమే. ఇందుకోసం నేరుగా సిఎం కేంద్రంతో చర్చిస్తున్నట్టు కూడా చెప్పారు. గిరిజన వర్సిటీకి ఇంకా భూసేకరణ పూర్తికాలేదు. ఈనేపథ్యంలో వర్సిటీ పనుల ప్రారంభం మాట అటుంచితే ఎయిర్‌పోర్టు భూసేకరణకు సంబంధించి ఇటీవలే కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమయ్యాయి. దీంతో, ఓవైపు వైసిపి నాయకులు, మంత్రులు గొప్ప విజయంగా చెప్పుకుంటున్నప్పటికీ ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ప్రధాని ససేమిరా ముందుకు రావడం లేదని సమాచారం. ఇందుకు కారణం లేకపోలేదు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆర్థికంగా సాయం చేయాలని ఎన్నో సార్లు సిఎం జగన్మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఇప్పటికీ ఎలాంటి స్పందనలేదు. కనీసం ప్రారంభోత్సవానికైనా సహకరిస్తారని అనుకుంటే చుక్కెదురైంది. దీంతో, ఎయిర్‌పోర్టు నిర్మాణం అదుగో పులి అంటే ఇదిగో మేక అన్నచందంగా మారింది. భోగాపురంలో మెయింటైనెన్స్, రిపేర్స్, ఓవరాల్ (ఎంఆర్‌ఒ)తోపాటు కార్గో సౌకర్యాలు, ఏవియేషన్ అకాడమీతో కూడిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గతంలో టిడిపి హయాంలోనే ప్రణాళిక రూపొందించారు. టెర్మినల్ ఒకటో దశ పూర్తయ్యే నాటికి ఏటా 63 మిలియన్ల ప్రయాణికులకు సేవలు అందించగలుగుతుందని, రెండో దశ పూర్తిచేస్తే మరో 18 మిలియన్ల ప్రయాణికులకు సర్వీసు అందించవచ్చని అంచనాలు రూపొందించారు. ఈ నివేదికకు నాయ్ (ఎన్‌ఎఐ) కూడా ఆమోదం తెలిపింది. ఇందుకు 5,311 ఎకరాల భూమి సేకరించేందుకు సిద్ధపడినప్పటికీ ఆ స్థాయిలో భూములిచ్చేందుకు స్థానికులు నిరాకరించడం, పెద్దఎత్తున ఆందోళనలు చేయడంతో 2,703 ఎకరాలకు తగ్గింది. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండానే నిర్మాణ పనులకు టెండర్లు పిలిచారు. 13 నిర్మాణ సంస్థలు పాల్గొన్నప్పటికీ బిడ్ ఖరారు కాలేదు. అయినా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు హడావుడిగా 2019 ఫిబ్రవరి 14న నాటి సిఎం చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం వైసిపి అధికారంలోకి రాగానే పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు జిఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 2023లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, నష్టపరిహారం చెల్లించి, భూసేకరణ పూర్తిచేసేందుకు రెండేళ్ల సమయం పట్టేసింది. సేకరించిన భూమిలో 500 ఎకరాలు మినహాయించి మిగిలిన 2,200 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడతామని చెప్పడంతో మొత్తం ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్న వాటిలో ఏవైనా తప్పిస్తారా? అన్న సందేహాలను ప్రభుత్వం ఇప్పటికీ నివృత్తి చేయలేదు. మరోవైపు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ కేంద్రం ఎలాంటి భరోసా ఇవ్వలేదు. లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అంతమొత్తంలో నిధులు కేటాయించే పరిస్థితి లేదు. ఒప్పంద కాలపరిమితి సమీపిస్తుండడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆర్థికంగా సహకరించాలంటూ సాక్షాత్తు సిఎం జగన్మోహన్‌రెడ్డి కేంద్రానికి పలుమార్లు విన్నవించారు. విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందాలంటే భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకరించాలంటూ మార్చి 25న ప్రధాని మోడీ, హోం శాఖ, విమానయానశాఖ మంత్రులకు లేఖలు కూడా రాశారు. ఎన్‌ఒసి కోసం కూడా అందులో ప్రస్తావించారు. అయినా కేంద్రం నుంచి స్పందన రాలేదు. అయినప్పటికీ, ఈనెల 11, 12 తేదీల్లో ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు భారీ ఏర్పాట్లతో బ్రహ్మరథం పట్టేందుకు అధికార పార్టీ సిద్ధమౌతోంది. వేలాది మందిని ప్రత్యేక వాహనాల్లో తరలించేందుకు సిద్ధపడడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో తలపెట్టిన గిరిజన వర్సిటీ, ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు సహకరించకపోయినా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇవ్వకపోయినా బిజెపి ప్రభుత్వానికి వంతపాడడం వైసిపికి తగదని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

13న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ మహాసభ

ప్రజాశక్తి - పాలకొండ

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు)పార్వతీపురం మన్యం జిల్లా 3వ మహాసభ పాలకొండ పట్టణంలో ఈనెల 13న జరుగుతుందని, కావున ఈ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ నగర్ పంచాయతీ కమిటీ అధ్యక్షులు పడాల భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడుతూ ఇప్పటి వరకు మున్సిపల్ కార్మికులు నిర్వహించిన పోరాటాలు సమీక్షించి ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. మహాసభ జయప్రదానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి సిహెచ్ సంజీవి, కోశాధికారి పి.వేణు, ఉపాధ్యక్షులు సిహెచ్ సురేష్, కార్యవర్గసభ్యులు పి .విమల, సిహెచ్ శ్రీదేవి, రఘు పాల్గొన్నారు.

విపి రాజుపేటలో బాదుడే బాదుడు

పాలకొండ రూరల్: మండలంలోని విపి రాజుపేట పంచాయతీలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్రోలు, డీజిల్, నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, నాయకులు గండి రామినాయుడు, శశి, సంగంనాయుడు, రాంబాబు, శ్రీధర్, జగదీష్, వరహాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'రాజాం టిక్కెట్ ప్రతిభా భారతికివ్వాలి'

రేగిడి: మండల టిడిపి క్యాడర్ రాష్ట్ర టిడిపి పరిశీలకులు యనమల రామకృష్ణుడును, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి నివాసంలో మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. మాజీ జెడ్‌పిటిసి కిమిడి రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో మండల క్యాడర్ ప్రతిభా భారతకే రాజాం ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని కోరారు. ప్రతిభా భారతికి టికెట్ కేటాయిస్తే గెలుపు ఖాయమని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లానన్నారు.



పాలకొండ ఏరియా ఆస్పత్రి

అలా వచ్చి.. ఇలా వెళ్లి...

పాలకొండ/పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రమైన స్థానిక ఏరియా ఆసుపత్రి ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉంది. అయితే ఈ అసుపత్రిలో ప్రతి రోజూ 100 నుంచి 200 వరకు ఒపి ఉంటుంది. వచ్చే రోగులందరికీ సకాలంలో వైద్య సేవలు అందిచాల్సి ఉన్నా ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ప్రధాన కారణం వైద్య సిబ్బంది సమయపాలన లేకపోవడమేనని రోగులు చెబుతున్నారు. వైద్యులు సమయపాలన పాటించకుండా అలా వచ్చి.. ఇలా వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓపీ విభాగంలో వైద్యులు లేకపోవడంతో అత్యవసర విభాగంలో ఉన్నా వైద్యునిపై పని ఒత్తిడి పెరుగుతోంది. వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల మేరకు ఓపీ విభాగంలో వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే ఈ సమయ పాలనను ఇక్కడ విధులు నిర్వహించే కొంత మంది వైద్యులు పాటించడం లేదు. ప్రభుత్వ అసుపత్రి విధుల కన్నా వారి సొంత క్లీనిక్‌లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే అసుపత్రి సామర్థ్యానికి తగ్గ సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్లు

కానరాని వైద్యుల సమయపాలన

ఉన్న సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డెంగీ, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి రోజూ రోగుల తాకిడి ఆసుపత్రికి పెరుగుతోంది. కనీసం వీరికి సాధారణ వైద్య చికిత్సలు అందించేందుకు కూడా అవసరమైన వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. 12 గంటల తర్వాత ఆసుపత్రికి వెళ్తే వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఉండాల్సి ఉంటే, ఉదయం 10.30కు వచ్చి గంట కొట్టినట్టు 12గంటలు దాటగానే వైద్యులు మాయమవుతున్నారు. మాతాశిశు ఆసుపత్రిలో మాత్రం ఓపీ అనంతరం అడ్మిషన్‌లో ఉన్న రోగులను వైద్యులు పరీక్షలు నిర్వహించి వెళ్తున్నారు. ప్రధాన ఆసుపత్రిలో మాత్రం ఎటువంటి సమయ పాలన వైద్యులు పాటించలేదని తెలుస్తోంది. దీంతో అందరికీ అత్యవసర విభాగమే దిక్కు అవుతోంది. వ్యాధులు విజృంబిస్తున్న తరుణంలోనైనా వైద్యులు ఆసుపత్రిలో సమయ పాలన పాటించి రోగులకు వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

టిడిపి అభివృద్ధి నిరోధక పార్టీ

- వైసిపిని విమర్శించే అర్హత లేదు
- ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లయిన సందర్భంగా డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు


రాష్ట్రంలో టిడిపి అభివృద్ధి నిరోధక పార్టీ అని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక బోసు బొమ్మ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో నియోజకవర్గంలో టిడిపి అభివృద్ధి పనులేవీ చేపట్టలేదని విమర్శించారు. ఆఖరుకు తాను తీసుకొచ్చిన అభివృద్ధి నిధులు కూడా ఖర్చు చేయనీయలేదని చెప్పారు. టిడిపి నాయకులు చెప్పిందల్లా విలేకరులు వార్తలు రాయడం సరైనది కాదని చెప్పారు. వారు చేసిన అభివృవద్ధి ఏమిటో ప్రశ్నించకుండా చెప్పింది రాయడం తగదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, గిరిరఘు, రాపాక మాధవరావు పప్పల లక్ష్మణరావు, జి.నాగేశ్వరరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి నేటికి ఐదేళ్లయిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కటింగ్ చేసి వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మూడు మండలాల, మున్సిపాలిటీ పరిధిలోగల ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్లు, జెడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, ఎఎంసి చైర్పర్సన్, వైస్ చైర్మన్ మండలాల, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి డైరెక్టర్లు, పిఎసిఎస్ చైర్మన్లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ముఖ్యమంత్రి ప్రజాసంకల్పయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన ఆదివారం స్థానిక కార్గిల్ సెంటర్లో గల వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్ పర్సన్ రౌతు హనుమంత రావు, బంకి లక్ష్మణరావు, కడగల రమణ, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, కోడం విజయకుమార్, ముద్దాడ చక్రవర్తి, మరియ దాసు, గణపతి , మోహన్‌రావు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక రావాడ జంక్షన్ వద్ద గల వైఎస్ విగ్రహానికి ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపిటిసిలు వి.బంగారనాయుడు, టివిఎస్ స్వామియాజులు, పిఎసిఎస్ అధ్యక్షులు కె. గౌరీశంకర్, ఐదు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వీరఘట్టం : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టే ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి డి.వెంకట రమణ నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి పూలమాల వేశారు. కార్యక్రమంలో జంపు ఉమామహేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నాయకులకు కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



కురుపాంలో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు


ఆడలిలో గిరిజనులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం

సీతంపేట : మండలంలోని కిండంగి సచివాలయ పరిధిలో గులుమూరు పంచాయతీలో బిడిందిగూడ, ఆడలి, కొండచొర్లంగి, తుప్పలగూడ, రాయిమానుగూడ, చింతలగూడ, గులుమూరు, నేరడిగూడ, జంక్కబుడ్డడుగూడ, పొట్టి బెన్నడుగూడ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. గిరిజనులకు అండగా జగనన్న ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.


అనంతరాయుడుపేటలో సంచరిస్తున్న ఏనుగులు

అనంతరాయుడుపేటలో ఏనుగుల తిష్ట

సీతానగరం : మండలంలోని అంతరాయుపేడటలో ఏనుగుల గుంపు తిష్టవేసింది. గత వారం రోజులుగా ఏడు ఏనుగులు మండలంలో సంచరిస్తున్నాయి. ఈ ఏనుగుల గుంపు వరి, చెరకు పంటలకు నష్టం చేకూర్చడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులు రెండు రోజుల క్రితం పణుకుపేట గ్రామానికి చెందిన ఇద్దరు రైతులను గాయపర్చిన విషయం విదితమే. తక్షమే అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

పవన్‌కు భద్రత కల్పించాలి

సీతానగరం : జనసేన నేత పవన్ కల్యాణ్‌కు ప్రభుత్వం భద్రత కల్పించాలని జనసేన మండల నాయకులు ఎ.రమేష్, ఎ.వాసు, పి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదలపై దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. ఇటీవల మంగళగిరిలో పేదల ఇళ్లు ప్రభుత్వం కూల్చడంతో బాధితులను పరామర్శకు వెళ్లిన పవన్‌కల్యాణ్‌ను అడ్డుకుంటుందని అన్నారు. పేదల పక్షాన పోరాటం చేస్తున్న జనసేన అధినాయకుడికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎఒ సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న ఎరువుల షాపుల డీలర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది

ఎఒకు ఘనంగా వీడ్కోలు

బలిజిపేట : మండలం వ్యవసాయ అధికారిగా పని చేసి బదిలీపై వెళ్లిన సూర్యప్రకాష్‌ను మండలంలోని ఆర్థరైజ్డ్ డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించే వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుత ఎఒ శ్రావణ్‌కుమార్‌కు స్వాగతం పలికి విధులు నిర్వహించడానికి పూర్తిస్థాయిలో సహాయ సహకార అందిస్తామని సిబ్బంది, ఆథరైజ్డ్ డీలర్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విఎఎలు, డీలర్లు పాల్గొన్నారు.

లక్ష్మణరావు కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

వీరఘట్టం : మండలంలోని తెట్టంగికి చెందిన పాలకొండ ఎఎంసి వైస్‌చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ ఎస్ విజయరామరాజు ఆదివారం పరామర్శించారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకొని లక్ష్మణరావును ఓదార్చారు. ఆయనతో పాటు పలువురు టిడి నాయకులు పాల్గొన్నారు.


ఎఒ సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న ఎరువుల షాపుల డీలర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

పాలకొండ రూరల్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు పిల్లల కోసం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. నీతి కథలు, సైన్స్ ప్రయోగాలు, దేశ నాయకుల పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా గణేష్ బాబు మాట్లాడుతూ ఇటువంటి పుస్తకాలను పిల్లలు సద్వినియోగం చేసుకుని మేధాశక్తిని పెంచుకోవాలని కోరారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పార్వతీపురంటౌన్ : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి ఆదివారం కొమరాడ మండలం మార్కొండపుటికి చెందిన బోనెల ఆనందరావు కుమార్తె సోనియా విశాఖలో జిఎన్‌ఎం ట్రైనింగ్‌కు వెళ్లేందుకు రూ.2నగదును అందించారు. వీటితో పాటు పట్టణంలో కొత్తవలస పరిదిలో గల 7వవార్డు నందమూరి కాలనీలో ఉన్న పేద మహిళా వృద్ధులకు రగ్గులు (దుప్పట్లు), స్టీల్ గ్లాసులను ఆ వార్డు కౌన్సిలర్ బొత్స ఆనందరావు, పోలీస్ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ప్రతి నెలా తనకు వచ్చిన జీతంలో కొంత సొమ్మును వెచ్చించి పేదలకు సహాయపడడం అభినందనీయమని, తోటి సహోద్యోగులు కృష్ణమూర్తిని అభినందించారు.


పేదలైన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి


గోగునార తీస్తున్న మహిళలు

ధర లేక.. గోగు రైతు గోడు

పత్తాలేని జెసిఐ

లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమలో రెండేళ్లుగా చెరకు క్రషింగ్ చేయడం లేదు. గతేడాది కూడా సంకిలి ఫ్యాక్టరీకి చెరకు తరలించడం రైతులకు తలకుమించిన భారంగా మారింది. దీంతో ఈ ఏడాది రైతులు చెరకు సాగు తగ్గించి గోగు పంటపై ఆసక్తి చూపించారు. ప్రస్తుతం ధర లేక పోవడంతో గోగు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి సమయంలో ధర నిర్ణయం, కొనుగోలులో కీలకంగా వ్యవహరించాల్సిన జెసిఐ పత్తాలేకుండా పోయింది.

ప్రజాశక్తి–బొబ్బిలిరూరల్

నియోజకవర్గంలో ఈ ఏడాది 600 ఎకరాల్లో, మండలంలో 150 ఎకరాల్లో రైతులు గోగుసాగు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది గోగు సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ ధర తగ్గిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది పుట్టి (ఒక బేలు) సుమారు మూడు క్వింటాళ్ల రూ.15 వేలు ఉండేది. ప్రస్తుతం కొనేందుకు ఏ వ్యాపారీ ముందుకు రాకపోగా వచ్చిన వారు రూ.9800కే అడుగుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతు దిగాలుగా ఉన్నాడు.

ఖర్చు ఎక్కువే

ఎకరా గోగు పంటకు సుమారు రూ.25 వేలు పెట్టుబడి అవుతుంది. పంట తీసేందుకు రూ.3 వేలు వరకు, ఒక్కో బండి అద్దె రూ.400, గొప్పునకు రూ.5 వేలు వేలు, సేకు పులమడానికి రూ.5 వేలు, ఒక్కో కట్ట కట్టడానికి ఐదారు రూపాయలు, కట్టే కూలీకి రూ.400.. ఇలా మొత్తంగా రూ.25 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. కానీ కొనుగోలు జరగడం లేదు. దీంతో రైతుకు కష్టమే మిగులుతుంది.

పత్తా లేని జెసిఐ

గతంలో బొబ్బిలి ప్రాంతంలోని జ్యూట్‌మిల్లులు పనిచేస్తుండడంతో రైతులు చెరకుతోపాటు గోగును ఎక్కువగా సాగుచేస్తూ ఉండేవారు ప్రస్తుతం జ్యూట్‌మిల్లులు మూతపడ్డాయి. దీంతోపాటు లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ గానుగ ఆడక పోవడంతో మళ్లీ రైతులు గోగు పంటను వేశారు. గోగు పంట వేసినప్పటికి దానిని కొనుగోలు చేసే జెసిఐ (జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) గత మూడేళ్లుగా కొనడం లేదు. అంతేకాదు, రైతులకు సలహాలు ఇచ్చేందుకు కనీసం కార్యాలయం తెరవడం లేదు. దీంతో గోగురైతులు ప్రయివేట్ వర్తకులనే ఆశ్రయిస్తున్నారు. వారు చెప్పిన రేటుకే రైతులు తమగోగు పంటను ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది.


మూతపడిన జెసిఐ కార్యాలయం

గానుగ లేకపోవడం వల్లే



గతంలో చెరకు సాగుచేశాను. లచ్చయ్యపేటలో చెరకు క్రషింగ్ ఆగిపోవడంతో గోగు వేశాను. దీనిని కొనేవారు లేకపోవడంతో నార తీసి కట్టలు కట్టి ఇంటి వద్దే భద్రపరిచాను. వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు.

– పాలేటి లక్ష్మణ, రైతు, కలవరాయి

గతేడాది రూ.15 వేలు ఉండేది



రెండు ఎకరాల్లో గోగు వేశాను. గతంలో పుట్టి రూ.15 వేలకు కొన్న వర్తకులు ఈ ఏడాది రూ.9800కే అడుగుతున్నారు. జెసిఐ ధర నిర్ణయించకపోవడం, కొనుగోలు చేయకపోవడం వల్ల ప్రయివేటు వ్యాపారులకే వారు నిర్ణయించిన ధరకే ఇవ్వాల్సి వస్తుంది.

– కోరాడ సత్యనారాయణ, రైతు, కలవరాయి

ఎన్‌జిఒల సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని అన్ని ప్రభుత్వ సచివాలయాల్లో ఎన్జీవో సంఘం బొబ్బిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు జి.సూర్యనారాయణ, కార్యదర్శి బి.రామారావు, వైస్ ప్రెసిడెంట్ జి.రామారావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగిని సంఘ సభ్యత్వం చేర్పించుకొని భవిష్యత్తులో వారి సమస్యపై పోరాడేందుకు ఉపయోగపడుతుందన్నారు ఇంతవరకు 800 మందిని సభ్యత్వ నమోదు చేశామని చేశామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి – పాచిపెంట

మండలంలోని పనుకువలస, పాచిపెంట తదితర గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఆదివారం స్థానిక తహశీల్దార్ ఆర్.రాజశేఖర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో గల పలువురు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించిచారు. అనంతరం వారి దరఖాస్తులను పరిశీలించారు. ఇప్పటి వరకు మండలం నుంచి 283 దరఖాస్తులు వచ్చాయని, మిగతా అర్హులైన పట్టభద్రులు ఈనెల 7 నాటికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు విఆర్‌ఒలు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి – వీరఘట్టం

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై తహశీల్దార్ జల్లెపల్లి మాధవి ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం మండల కేంద్రంతో పాటు నడుకూరు, చిట్టపూడివలసలో పర్యటించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ జి.ప్రసాదరావు, విఆర్ఒ భాస్కరరావు, సిబ్బంది ఉన్నారు.


మహాసభలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

9న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి – బలిజిపేట

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 9వ జిల్లా మహాసభలు ఈనెల 9న మక్కువలో జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు సత్యంనాయుడు, మండల కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సత్యంనాయుడు మాట్లాడుతూ మక్కువలో జరుగు మహాసభలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటానికి రూపకల్పన చేస్తామని, కావున వ్యవసాయ కార్మికులంతా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు నల్ల ఈశ్వరరావు, గడిదాసి సింహాచలం, అక్కపోలు అప్పలనాయుడు, గౌరు నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఈనెల 9న జరుగు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. ఈ మహాసభలో గత మూడేళ్లలో సంఘం చేపట్టిన కార్యక్రమాలు చర్చించుకుని, భవిష్యత్తు కర్తవ్యాలను తీసుకుంటుందన్నారు. కావున మహాసభలకు వ్యవసాయ కార్మికులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధికి ఆమడ దూరాన సప్పగూడ

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర వచ్చి 75 ఏళ్లు గడిచిన చాలా గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్నాయి. దీంతో ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారు. ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజన బతుకుల్లో మాత్రం మార్పు రాలేదు. విద్య, వైద్యం కనీసం మౌలిక వసతులు లేక దుర్భర జీవితం గడుపుతున్నారు. వివరాల్లోకి వెళితే పెద ఖర్జ పంచాయితీ సప్పగూడలో 14 కుటుంబాలు జీవన సాగిస్తున్నాయి. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు మంచినీరు లేక బావిపైనే ఆధారపడి జీవన సాగిస్తున్నారు. పక్కా ఇళ్లు లేకపోవడంతో శిధిలమైన ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారు. గ్రామం దిగువ ప్రాంతంలో ఉండడంతో వర్షపు నీరు గ్రామంలోకి చేరుతుంది. అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.


పక్కా గృహాలకు నోచుకోని సప్పగూడ గిరిజన గ్రామం


108 వాహనంలో తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

108లో ప్రసవం

ప్రజాశక్తి – వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురం పంచాయతీ దువ్వనపాడుకు బిడ్డిక నయోమి ఆదివారం వేకుజామున 108లో ప్రసవమైంది. నయోమికి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. వాహన గ్రామానికి చేరుకొని నయోమిని పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా ఎ.వెంకటాపురం వద్దకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో స్థానిక వైద్యాధికారి ఉదయ్ సూచనల మేరకు 108 ఇఎంటి కె.శ్రీనివాసరావు చాకచక్యంగా డెలివరీ చేశారు. అనంతరం నయోమిని పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపాల్టీలో 22, 23, 24 వార్డుల్లో జరుగుతున్న సిసి కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేసి త్వరిత గతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వీటితో పాటు మిగతా వార్డుల్లో జరుగుతున్న సిసి రోడ్లు, కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరి గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, సరివిశెట్టి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు మెరువ వెంకట్రావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సిపురంలో దళితులకు పొజిషన్ పట్టాలు

పార్వతీపురంరూరల్ + : మండలంలోని నర్సిపురానికి చెందిన 151మంది దళితులకు పొజిషన్ పట్టాలను స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు ఆదివారం అందజేశారు. ఇటీవల ఈ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా, తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందించి సమస్య పరిష్కరించారు. దీంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యాటకుల సందడి

సీతంపేట : కార్తీక మాసం రావడం, అందులోనూ ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు పోటెత్తారు. స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకులతో సందడిగా మారింది. పార్కులోని అందాలను ఆస్వాదించారు. పర్యాటకులు జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. ఆనంద విహార్ వద్ద డాన్సర్ చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

సైబర్ నేరాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి – పాలకొండ రూరల్

స్థానిక ఎపి జివిబి బ్యాంక్ పాలకొండ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ ఆదివారం చేపట్టారు. ఈ ర్యాలీలో పాల్గొన్న బ్యాంకు రీజనల్ మేనేజర్ బి.రాఘవేంద్ర మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వల్ల బయట వ్యక్తులకు ఎటిఎం పిన్, ఒటిపి నెంబర్లు ఇచ్చి మోసపోవద్దని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన ఇన్సూరెన్స్‌లు చేసుకోవాలని, వాటివల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ నరేష్, ఫీల్డ్ ఆఫీసర్ రవి కుమార్, బ్యాంక్ మిత్ర, బ్యాంక్ సిబ్బంది శ్రీను, పోలీసు సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న సూర్యపీఠం నిర్వాహకులు నరహరిశాస్త్రి

సూర్య పీఠంలో సప్త సూర్య నమస్కారాలు

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

పార్వతీపురం పట్టణ శివారున గల శ్రీసూర్య పీఠంలో ఆదివారం సూర్యపీఠం నిర్వాహకులు వేమకోటి నరహరి శాస్త్రి వైదిక ఆధ్వర్యంలో సప్త సూర్య నమస్కారాలు చేశారు. మిత్ర రవి, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవితృ, అర్క భాస్కర ప్రీతికరంగా సప్తసూర్య నమస్కారాలతో పాటు పీఠంలో ఉన్న అయ్యప్ప స్వామి సన్నిధానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ఈ వ్రతాలకు సంతోష్ స్వామి అయ్యప్ప స్వామి భక్తులకు పూజాసామగ్రి, ప్రసాదాలు ఉచితంగా అందించారు.

బిసి కాలనీ పాఠశాలలో సమస్యల కొలువు

- ఇరకు గదుల్లో విద్యార్థుల అవస్థలు
- నిరుపయోగంగా అదనపు భవనం

ప్రజాశక్తి – వీరఘట్టం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తుందే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. గతంలో మోడల్ పాఠశాలగా ఎంపికైన ఈ పాఠశాల పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ గుర్తింపును కోల్పోయింది. ప్రభుత్వ విద్యపై చిత్తశుద్ధిలేని పాలకులు, అధికారుల వైఖరి వల్ల పేదల విద్యార్థులకు సర్కారు చదువు అందని ద్రాక్షలా మారింది. ఇందుకు నిదర్శనం మండల కేంద్రంలోని బిసి కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది.

ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 130 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ రెండే రెండు తరగతి గదులు ఉన్నాయి. తరగతి గదులు ఇరుకు ఇరుగ్గా ఉండడంతో పాఠాలు చెప్పేందుకు ఇటు ఉపాధ్యాయులు, వినేందుకు అటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డోర్ కర్టన్లు కట్టి విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఏ ఒక్క ఉపాధ్యాయుడు సెలవు పెట్టినా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులకు విధి నిర్వహణ పెనుభారంగా మారుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 130 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయ ఉండాల్సి ఉంది. అయితే ముగ్గురు ఉపాధ్యాయులతో ప్రస్తుతం పాఠశాల నిర్వహణ కొనసాగుతుంది.


ఒకే తరగతి గదిలో ఇరుకు ఇరుగ్గా కూర్చొన్న విద్యార్థులు

నిరుపయోగంగా అదనపు భవనం

అప్పట్లో ఈ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండడవల్ల విద్యాశాఖ ఉన్నత స్థాయి అధికారులు అదనపు భవనం నిర్మించేందుకు రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో రూ.7.5 లక్షలతో పనులు చేపట్టారు. గుత్తేదారు సకాలంలో పనులు చేసినప్పటికీ అధికారుల అలసత్వం వల్ల సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు అర్థాంతరంగా పనులు నిలిపివేశారు. రెండేళ్ల కిందట మనబడి నాడు నేడు కార్యక్రమంలో భాగంగా రూ.19 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా రూ.లక్షా50వేలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినట్లతే ఇప్పుడు విద్యార్థులు ఇరుకైన గదిలో విద్య అభ్యసించే పరిస్థితి ఉండేది కాదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు .

అపారిశుధ్యం నడుమ పాఠశాల

పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో పాఠశాల చుట్టూ ఉన్న గృహస్తులు చెత్తాచెదారాన్ని పడివేయడంతో వర్షానికి తడిచి, ఎండకు దుర్వాసన వెదజల్లడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అలాగే పాఠశాలలో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో నెలకొన్న అపారిశుధ్యం